# తన జీవితంలో ప్రవచనం యొక్క నెరవేర్పైయున్నాడు

తాను కేవలం నరుదుకాక, దేవుని కుమారుడైయున్నట్టు స్థిరమైన రుజువుగా ఆయన భవిష్యత్ విషయాలను చెప్పగలగడం సరిపోతుందని ప్రభువు తలచారు: "జరిగినప్పుడు నేనే ఆయననని మీరు నమ్మునట్లు అది జరుగక మునుపు మీతో చెప్పుచున్నాను" (యోహాను 13:19). అలాగే, బైబిలును రచించిన దేవుని ప్రవక్తలందరికి జనులు శ్రద్ధ చూపినట్లయితే, తెల్లవారువరకును వేకువ చుక్క ఉదయించువరకును (2 పేతురు 1:19 చూడు) చీకటిగల స్థలములో వెలిగిచ్చు దీపములుగా పాత నిబంధన ప్రవచనాలు ప్రజ్వరిల్లుతున్నాయని వారు ఒప్పుకుంటారు. పాత నిబంధన ప్రవక్తలు కేవలం తమ కాలంలో ఉన్న జనులతో మాత్రమే మాట్లాడలేదు, నేడు కూడా మనకొరకు వారు పలికారు (1 పేతురు 1:10–12).[1]

## కన్య యొక్క కుమారుడు (యెషయా 7:14)

క్రీస్తు పూర్వం 735లో సిరియాయు, ఉత్తర రాజ్యమైయున్న ఇశ్రాయేలును – దక్షిణ రాజ్యమైయున్న యూదాకు విరుద్ధంగా ఏకమయ్యాయి. "గాలికి అడవి చెట్టు కదిలినట్లు," యూదా వణకిపోయింది (యెషయా 7:2). ఆ పరిస్థితిలో యూదా రాజైన ఆహాజును ఆదుకొనడానికిగాను తన వర్తమానంతో దేవుడు యెషయాను అతని వద్దకు పంపాడు; అయితే ఆహాజు దుష్టుడును వేషధారియునైయున్నాడు. హేతురహితమైన ఆహాజు యొక్క నీచ కార్యము దేవుని కృపను తూలనాడింది: ఆయన ఆహాజునుగూర్చి "విసుగు" చెందాడు. సిరియా ఇశ్రాయేలు కుట్రనుండి ఆహాజును తప్పించుదునను దేవుని సూచనను సహితము అతడు త్రోసిపుచ్చాడు. అతడు దానిని నిరాకరించినా, దేవుడు ఎలాగైనా అతనికి సూచన యివ్వబూనాడు, కాని ఆ సూచన అతడు యిష్టపడేది కాదు:

> కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారునికని అతనికి ఇమ్మానుయేలను పేరుపెట్టును (యెషయా 7:14).

ఆహాజు ఎరిగిన ఒక ప్రాముఖ్యమైన యౌవన స్త్రీ త్వరలో వివాహమాడి, "దేవుడు మనకు తోడు" అని అర్థమిచ్చునట్టి ఇమ్మానుయేలు అని పేరు పెట్టబడే కుమారుని కంటుంది అనేది తలంపు. ఆ శిశువు పెద్దవాడు కాక మునుపే ఆ రెండు రాజ్యాలు చెదిరిపోతాయి, ఏదియేమైనా, దేవుడు ఆశ్చర్యార్థకమైన మరొకదాన్ని సూచించాడు: యికమీదట ఏ మాత్రమును అవి యూదాకు అపాయం కలిగించ నేరవు, అష్షూరునకు

కలిగిస్తుంది. వాస్తవంగా, యూదావారు ఆకలిబాధలో చనిపోయే పరిస్థితి కలిగేలా యూదాను ముట్టడి వేయబోతుంది. ప్రవక్త ప్రకారం, ఒక ఆవును, రెండు గొర్రెలను ఒకడు బ్రతికించుకోగలడట (యెషయా 7:21, 22). గనుక, పాలు లభ్యమౌతాయి, దేశంలో మిగిలిన జనులు పెరుగును తేనెయు తింటారట.

ప్రవచనంలోని ఈ శిశువు, అప్పుడు, పెరుగును, తేనెను భుజిస్తాడట (యెషయా 7:15). ఇమ్మానుయేలు, "దేవుడు మనకు తోడు" అనేది ఆ బాలుని యొక్క పేరు. దేవుడు యూదాతో ఉండి, దేశాన్ని శిక్షిస్తాడనడానికి ఆ బాలుడు దేవుని చిహ్నమై ఉంటాడు! దేవుడు తన ప్రజలతో రెండు విధాలుగా ఉంటాడు! దేవుడు యూదాతో ఉంటాడు, కాని దీవించడానికి కాదు; ఆయన యూదాతో ఉండేది శిక్షించడానికే. ఆహాజును అతని జనులును విశ్వాసములేనివారైయున్నారు, మరియు దేవుని వాక్యము నిశ్చయమైనది.

యెషయా 7:14 యొక్క హ్రస్వ-కాలపు (తక్కువ కాలపు) భావం. అయితే, ప్రవక్త యొక్క భాషలో క్రీ. శ. ఎనిమిదియవ శతాబ్దపు స్థానికమైనదాన్ని దాటి ఎంతో గొప్పది ఉంది. ఆహాజు జీవించిన కాలంలోనే నెరవేర్చబడాలని యెషయా దగ్గర కాలపు నెరవేర్పును సూచించుట మాత్రమే కాదు, మరియ, యోసేపుల కాలానికి సంబంధించిన దీర్ఘకాలపు నెరవేర్పుగాను సూచింపబడింది. తరచుగా ప్రవచనాలు ప్రైమరీ మరియు సెకండరీ భావాలుగాను, ప్రత్యక్ష, పరోక్ష వర్తింపులుగాను ఉంటాయి. కన్యయైన మరియ గర్భవతియై యుండడం జారత్వమును బట్టిగాక, దేవుని ఉద్దేశాన్నిబట్టినీ, యెషయా యొక్క ప్రవచనాన్ని బట్టియునని దేవదూత మరియకు బయలుపరచాడు (మత్తయి 1:23).

యెషయా 7:14 యొక్క నెరవేర్పుల్లో క్రీ. పూ. ఎనిమిదవ శతాబ్దంలోని దానికిని, క్రీ. శ. మొదటి శతాబ్దంలోని దానికిని మధ్య వ్యత్యాసాలున్నాయి, అయిన పోలికలు కూడా ఉన్నాయి. పరిశుద్ధాత్మ మొదటి దానిని ఆధారంగా ఉంచుకొని, దానినుండి రెండవ దాన్ని ముందుగా చెప్పాడు. *'almah* అనే పదం విశాలమైన భావంతో (యౌవ్వనురాలు) క్రీ. పూ. ఎనిమిదవ శతాబ్దంలో కన్యక జన్మనిచ్చు విషయం అవసరం లేకపోయింది, అలాటిది ఒక సంఘటన ఆ కాలంలో జరిగినట్టు రికార్డు సహా లేదు. ఏదియెలాగున్నా, క్రీ. శ. మొదటి శతాబ్దంలో, విశేషమైన యౌవ్వనవతి (కన్య; Gk.: *Parthenos*; మత్తయి 1:23) తాను కన్యకయై ఉన్నప్పుడే తల్లియైయుంది.

ఆహాజు దినాల్లో జన్మించిన బాలుడు పేరుకు మాత్రమే ఇమ్మానుయేలు, "దేవుడు మనకు తోడు"; ఆ బాలుడు నిజంగా దేవుడు కాదు. దానికి భిన్నంగా, మరియ దినాల్లో జన్మించిన బాలుడు ఇమ్మానుయేలను పేరు పెట్టబడ్డాడు. "దేవుడు మనకు తోడు," ఎందుకంటే, ఆయన నిజంగా దేవుడే. ఆహాజు దినాల్లో ఆ శిశువు తన పేరునుబట్టి మాత్రమే సూచనయైయున్నాడు; మరియకు జన్మించిన శిశువైతే పేరును బట్టియు సారాంశమును బట్టియు సూచనయైయున్నాడు.

ఆహాజు దినములలో ప్రవచింపబడిన శిశువు దేవుడు యూదాతో ఉంటాడనేదానికి సూచనయై ఉన్నాడు. మరియ దినాలకు ప్రవచింపబడిన బాలుడు దేవుడు సర్వలోకంతో ఉంటాడనే దానికి సూచనయైయున్నాడు (యోహాను 3:16; 1 యోహాను 2:2). ఆహాజు దినాల్లో ఉన్న సూచన దేవుడు యూదాను శిక్షిస్తాననడానికి హెచ్చరికగా ఉంది, మరియ

దినాల్లో ఉన్న సూచన దేవుడు జనములను ఆశీర్వదిస్తాడనే శుభ వర్తమానాన్నిస్తుంది.

మరియ కుమారుడు కన్య గర్భమందు జన్మించక పోయినట్లయితే, సత్యముగా (నిజంగా) ఇమ్మానుయేలు "దేవుడు మనకు తోడు" అయ్యుండక పొయ్యేవాడే, ఎందుకంటే ఆయన సంపూర్ణంగా మనలో ఒకని వంటివాడై ఉండేవాడే; అంతేకాదు, ఆయన దేవ–మానవుడు కాకపోయి ఉండేవాడే. పైగా, ఆయన జారత్వమువలన పుట్టినవాడై, సాంప్రదాయ విరుద్ధమైన కుమారుడైయుండేవాడే. ఒకవేళ యిదే నిజమైయుండినట్లయితే, అప్పుడు యేసు దైవమే అయ్యుండేవాడు కాదు సరిగదా, ఆయన మతం మోసమైయుండేది కూడా. ఆలాటి పరిస్థితిలో, ఇమ్మానుయేలు, "దేవుడు మనకు తోడు," అనే పేరు అపహాస్యమైయుండేదే.

## అబ్రాహాము సంతానం (ఆది. 22:18)

అబ్రాహాము లోకమునకు ఆశీర్వాదంగా ఉంటాడని దేవుడైన యెహోవా ముందుగానే తెలియజేశాడు. "నీయందు" అని ఆది. 12:3లోని ప్రయోగానికి తోడు, ఆ ముందు వచనంలో "నీ సంతానమందు" అనేదాన్ని ఆయన వ్యక్తపరచాడు. ఆది. 22:17లో నీ "సంతాన"మంటూ అబ్రాహాము పిల్లలను (ఇశ్రాయేలు సంతతినంతటిని సూచిస్తూ) గూర్చి ఉపయోగించబడినా, 22:18వ వచనంలో ఉపయోగించినట్టు ఉపయోగించ లేదు. ప్రత్యేకించి ఒకని గూర్చియన్నట్టు అబ్రాహాము "సంతతి" సూచింపబడింది, ఆయన యేసే. గలతీ. 3:16లో, "ఆయన 'అనేకులను గూర్చి అన్నట్టు కాక,' ఒకనిగూర్చి అన్నట్టే, 'నీ సంతానమునకును' అనెను, ఆ సంతానము క్రీస్తు" అని పౌలు చెప్పినప్పుడు, అతడు ఈ వచనాన్ని సూచించాడు. దైవ ప్రేరేపితుడైన క్రొత్త నిబంధన లేఖకుడు, పాత నిబంధన ప్రవచనానికి ప్రకాశవంతమైన భావాన్ని తెలిపాడు.

ఆది. 22:18కి గల మెస్సీయాకు సంబంధించిన ప్రాముఖ్యతను గూర్చి మరియొక క్రొత్త నిబంధన వ్యక్తికూడా సూచించాడు. యెరూషలేము దేవాలయంలోని సొలొమోను మంటపము వద్ద, పేతురు యిలా అన్నాడు, "ఆ ప్రవక్తలకును, దేవుడు అబ్రాహాముతో –నీ సంతానమందు భూలోక వంశములన్నియు ఆశీర్వదింపబడునని చెప్పి మీ పితరులతో చేసిన నిబంధనకును, మీరు వారసులైయున్నారు" (అపో. 3:25).

## గలిలయలోని పరిచర్య (యెషయా 9:1, 2)

రాబోయే మెస్సీయాను గూర్చిన పాత నిబంధన ప్రవచనాలకు ఎక్కువగా సత్వరమైన, స్థానిక భావముంది. ఏదియెలాగున్నా, కొన్నింటికి మాత్రం ఏ విధమైన పాత నిబంధన భావం లేనట్టు కన్పిస్తాయి. క్రీ. పూ. ఎనిమిదవ శతాబ్దపు "సువార్త ప్రవక్త"యైన యెషయాచే తరువాత పద్ధతిలో వ్రాయబడిన వాటిలో ఒకటి:

> అయినను వేదనపొందిన దేశముమీద మబ్బు నిలువలేదు
> పూర్వకాలమున ఆయన జెబూలూను దేశమును

నఫ్తాలి దేశమును అవమానపరచెను
అంత్యకాలమున ఆయన సముద్ర ప్రాంతమును, అనగా యొర్దాను అద్దరిని అన్యజనుల
గలిలయ ప్రదేశమును
మహిమగలదానిగా చేయుచున్నాడు.
చీకటిలో నడుచు జనులు గొప్ప వెలుగును చూచుచున్నారు
మరణచ్ఛాయగల దేశనివాసులమీద వెలుగు ప్రకాశించును (యెషయా 9:1, 2).

"తరువాత" గలిలయ ప్రాంతము నిరంతరము ప్రఖ్యాతిగలదిగా ఉండేలా మహిమ గల స్థితికి చేరుకుంటుంది. ఆయన పరలోకాన్ని వీడక మునుపే, తన భూనివాసకాలపు పరిచర్యలోని ఎక్కువ కాలం గలిలయలో గడపాలని ప్రభువు సంకల్పించినట్టు గోచరిస్తుంది:

యోహాను చెరపట్టబడెనని యేసు విని గలిలయకు తిరిగి వెళ్లి నజరేతు విడిచి జెబూలూను నఫ్తాలియను దేశముల ప్రాంతములలో సముద్రతీరమందలి కపెర్నహోము నకు వచ్చి కాపురముండెను.
– జెబూలూను దేశమును, నఫ్తాలిదేశమును, యొర్దానుకు ఆవలనున్న సముద్ర తీరమున అన్యజనులు నివసించు గలిలయయు చీకటిలో కూర్చుండియున్న ప్రజలును గొప్ప వెలుగును చూచిరి. మరణ ప్రదేశములోను మరణచ్ఛాయలోను కూర్చుండి యున్నవారికి వెలుగు ఉదయించెను (మత్తయి 4:12-16a).

## అభిషిక్తుడైన ప్రసంగి (యెషయా 61:1-3)

క్రీ. పూ. ఎనిమిదవ శతాబ్దంలో యెషయాయొక్క చర్మపు కాగితం ద్వారా అభిషేకింప బడిన ప్రసంగి ప్రవచన రీతిగా యిలా పలికాడు:

ప్రభువగు యెహోవా ఆత్మ నా మీదికి వచ్చియున్నది దీనులకు సువర్తమానము
ప్రకటించుటకు యెహోవా నన్ను అభిషేకించెను
నలిగిన హృదయము గలవారిని దృఢపరచుటకును
చెరలోనున్న వారికి విడుదలను
బంధింపబడినవారికి విముక్తిని ప్రకటించుటకును
యెహోవా హితవత్సరమును మన దేవుని ప్రతిదండన దినమును ప్రకటించుటకును
దుఃఖాక్రాంతులందరిని ఓదార్చుటకును
సీయోనులో దుఃఖించువారికి ఉల్లాస వస్త్రములు ధరింపజేయుటకును
బూడిదకు ప్రతిగా పూదండను
దుఃఖమునకు ప్రతిగా ఆనందతైలమును
భారభరితమైన ఆత్మకు ప్రతిగా స్తుతివస్త్రమును వారికిచ్చుటకును ఆయన నన్ను
పంపియున్నాడు.
యెహోవా తన్ను మహిమపరచుకొనునట్లు
నీతి అను మస్తకివృక్షములనియు
యెహోవా నాటిన చెట్లనియు వారికి పేరు పెట్టబడును (యెషయా 61:1-3).

క్రీ. శ. మొదటి శతాబ్దంలో ముప్పై ఏండ్ల ఈడుగల విద్యలేని వడ్రంగి, సమాజ

మందిరంలోని ఉపదేశకులను ఆశ్చర్యచకితులనుగా చేశాడు:

> తరువాత ఆయన (ప్రభువైన యేసు) తాను పెరిగిన నజరేతునకు వచ్చెను. తన వాడుకచొప్పున విశ్రాంతిదినమందు సమాజమందిరములోనికి వెళ్లి, చదువుటకై నిలుచుండగా, ప్రవక్తయైన యెషయా గ్రంథమును ఆయన చేతికియ్యబడెను; ఆయన విప్పగా–
> ప్రభువు ఆత్మ నా మీద ఉన్నది
> బీదలకు సువార్త ప్రకటించుటకై
> ఆయన నన్ను అభిషేకించెను . . . (లూకా 4:16-18a).

ముందుగా చెప్పబడిన ఆ రమ్యమైన ఆ ప్రవచనాన్ని ఆయన చదువుటయందు కొనసాగించాడు తరువాత ఆయన గ్రంథమును చుట్టి పరిచారకునికిచ్చి కూర్చుండెను. సమాజ మందిరములోనున్నవారందరు ఆయనను తేరిచూడగా, ఆయన "నేడు మీ వినికిడిలో ఈ లేఖనము నెరవేరెనని" ధైర్యంగా ప్రకటించెను (లూకా 4:20, 21).

ఆలాటి క్లెయిమ్ ప్రభువైన యేసు తప్ప వేరెవరైనా చేసియుంటే, తీవ్రమైన ఆలోచనకు మించినదైయుంటుంది. అయితే ఆయన అలాటి క్లెయిమ్ చేయడం సహజం, అది తగినదైయుంది.

## మోషేవంటి ప్రవక్త (ద్వితీయో. 18:15)

సీనాయి పర్వతము వద్ద పర్వతం కంపించినప్పుడు జనులు కూడా వణికారు. ఆ పర్వత శిఖరమున అగ్ని, మెరుపు మరియు దట్టమైన మేఘాలు కమ్మాయి, మరియు కొలిమిలోనుండి లేచిన పొగవంటిది ఆ పర్వతమంతయు ఆవరించింది (నిర్గమ. 19:16-18; 20:18). దేవుని ధ్వని ఆ పది ఆజ్ఞలను పలికినప్పుడు వారు వణికారు. దేవుని ప్రసన్నత వారికి సమీపంగా ఉన్నందున వారు చావకుండునట్లు, మోషేయే తమతో మాట్లాడవలనని జనులు బతిమాలుకున్నారు. మోషే వారి పక్షంగా దేవుడైన యెహోవా వద్ద మాట్లాడాడు, మరియు తన వంటి వేరొక దైవికమైన ప్రతినిధిని దేవుడు పంపుతాడనే వాగ్దానాన్ని మోషే వారికి తెలియజేశాడు:

> హోరేబులో ఆ సమాజ దినమున నీవు – నేను చావకయుండునట్లు మళ్లి నా దేవుడైన యెహోవా స్వరము నాకు వినబడకుండునుగాక, ఈ గొప్ప అగ్ని నాకు కనబడ కుండునుగాక అని చెప్పితివి. ఆ సమయమున నీ దేవుడైన యెహోవా నీ మధ్యను నా వంటి ప్రవక్తను నీ సహోదరులలో నీ కొరకు పుట్టించును, ఆయన మాట నీవు వినవలెను (ద్వితీయో. 18:15, 16).

దేవుని తరుపున మాట్లాడే వానికొరకు ప్రజలు చేసిన విన్నపం న్యాయమయ్యిందిగా దేవుడు భావించాడు. "వారు చెప్పిన మాట మంచిది" అని దేవుడు మోషేకు తెలిపి (ద్వితీయో. 18:17), ఆయన ఆ వాగ్దానాన్ని మరల చెప్పాడు:

> వారి సహోదరులలోనుండి నీ వంటి ప్రవక్తను వారి కొరకు పుట్టించెదను; అతని నోట

> నా మాటల నుంచుదును; నేను అతని కాజ్ఞాపించునది యావత్తును అతడు వారితో చెప్పును. అతడు నా నామమున చెప్పు నా మాటలను వినని వానిని దానిగూర్చి విచారణచేసెదను (ద్వితీయో. 18:18, 19).

మోషేవంటి ప్రవక్త వచ్చును. మోషే సాధారణమైన ప్రవక్త కాదు కదా. ఆయన అతనితో "గూఢ భావములతో కాదు, దర్శనమిచ్చి, ముఖాముఖిగా అతనితో మాట్లాడుదును"; అతడు యెహోవా స్వరూపమును నిదానించి చూచును (సంఖ్యా. 12:8). దేవుడైన "యెహోవాను ముఖాముఖిగా ఎరిగిన" మోషేవంటి యింకొక ప్రవక్త ఇశ్రాయేలీయులలో ఇదివరకు పుట్టలేదు (ద్వితీయో. 34:10). అందును బట్టి అతనివంటివాడుగా ఉండబోయే ప్రవక్త సామాన్యమైనవాడై ఉండడు.

దేవుని వాక్యము "అతని నోట" నుండునని వాగ్దానం చేయబడిన ప్రవక్తను గూర్చి దేవుడైన యెహోవా సెలవిచ్చాడు (ద్వితీయో. 18:18). అతనిని అతని మాటలను చేర్చుకునేవాడు దేవుని చేర్చుకొనినట్టును, అతనిని అతని మాటలను నిరాకరించడం దేవుని నిరాకరించడంగానే భావించబడింది (ద్వితీయో. 18:19).

అసాధారణమైన ఆ ప్రవక్తను గూర్చిన వాగ్దానాన్ని మోషే యొక్క జనులు ఎన్నడు మరచిపోలేదు. అతని రాకకొరకు ఎదురు చూచేలా వారు తమ పిల్లలను, పిల్లల పిల్లలను హెచ్చరించారు. వారు ఆయనను "ఆ ప్రవక్త" అనడం ఆరంభించారు (యోహాను 1:21, 25). మోషే అనంతరం పదిహేను శతాబ్దాల తరువాత, యోహాను యొక్క పరిచర్య జనుల దృష్టిని ఆకర్షిస్తుండగా, ద్వితీయో. 18:15లోని ప్రవచనాన్ని గూర్చి యూదులు సత్వరంగా ఆలోచింపనారంభించి, "నీవు ఆ ప్రవక్తవా?" అని ప్రత్యేకించి యోహానును అడిగారు (యోహాను 1:21). యోహాను కంటె గొప్పవాడు ఎవడును లేడుగాని, ప్రవచింపబడిన ఆ ప్రవక్త అతడు కాడు, గనుక, తన్ను ప్రశ్నించిన వానికి తాను ఆ ప్రవక్తను కానని స్పష్టంగా వివరించాడు.

ఏదియెలాగున్నా, యోహాను ఏ అద్భుతాన్ని చేయలేదు (యోహాను 10:41), కాని అతనికి ఒక బంధువున్నాడు. అతడు అయిదు బార్లి రొట్టెలను, రెండు చిన్న చేపలను తినగా మిగిలిపోవునట్లు (ఒకవేళ పదివేలమందే కావచ్చు) చేయగలడు (యోహాను 6:9, 10 చూడు). అలాటి ఒప్పించే సూచన ద్వితీయో. 18:15 ప్రవచనాన్ని గూర్చి ఆలోచించేలా యూదులను చేసినందున, "నిజముగా ఈ లోకమునకు రాబోవు ప్రవక్త ఈయనే అని చెప్పుకొనిరి" (యోహాను 6:14).

ప్రకృతికి తాను ప్రభువైయున్నట్టు యేసు ప్రదర్శించడం మాత్రమేగాక, ఆయన ఇంతవరకు ఎవ్వడును మాట్లాడని విధానంగా మాట్లాడాడు (యోహాను 7:46). ఒక నాడు దేవాలయములో సూచనప్రాయమగు ప్రతిపాదనను ఆయన చేసినప్పుడు, దానిని మనస్సులో నాటుకున్న యూదులు జన సమూహంలో ఒకనితో ఒకడు మాట్లాడుకొంటూ, ఆ గొప్ప బోధకుని ద్వితీయో. 18:15తో జతచేసి, "నిజముగా ఈయన ఆ ప్రవక్తయే అనిరి" (యోహాను 7:40).

సొలొమోను మంటపమున, పేతురు తన ప్రసంగములో ద్వితీయో. 18:15ను కోట్ చేస్తూ పదిహేను శతాబ్దాల క్రిందట చేయబడిన ఆ ప్రవచనం యొక్క నెరవేర్పు

యేసేయని తెలియజేశాడు (అపొ. 3:22). "ఆ ప్రవక్త" మాట విననివాడు ప్రజలలో ఉండకుండ సర్వనాశనమగుననెను (అపొ. 3:23). అందువలన సద్భావనతో ఆలోచించే యూదులు, తామే "ప్రవక్తలకు వారసులైయుండి" (అపొ. 3:25), క్రీస్తు యొక్క శరీరమందు మోషే ప్రవచనపు పలుకులయొక్క మహిమాయుక్తమైన నెరవేర్పును చూచారు.

## ఉపమానాలతో బోధించేవాడు (కీర్తన. 78:2)

ఆసాపు ఇశ్రాయేలీయులలో ప్రఖ్యాతిగాంచిన వాడైయున్నాడు. ఇతడు పాడుతూ చేతి తాళమును వాయించుతూ ఉండేవాడు, ప్రత్యక్ష గుడార సంబంధమైన గాన బృందానికి ప్రధానుడుగా దావీదుచే అతడు నియమింపబడ్డాడు (1 దినవృ. 6:31–33, 39; 15:19; 16:5). తాను దీర్ఘదర్శియై ఉండునట్లు అతడు పరిశుద్ధాత్మచే నిరూపించబడ్డాడు కూడా (2 దినవృ. 29:30), మరియు దైవ ప్రేరేపితములగు కీర్తనలకు అతడు లేఖకుడైయున్నాడు (కీర్తనలు 50, 73–83 చూడు) ఇవి కీర్తనల గ్రంథమందుంచబడ్డాయి. వ్రాయబడిన కీర్తన ఉపదేశించడానికిని క్షేమాభివృద్ధి కలిగించడానికిని, 78వ కీర్తనవంటిదై, maskil అని పిలువబడింది. అతని ఉపదేశంలోని భాగం ఉపమానంగా, అంటే కథగా వర్తింపు కలిగియుంటుంది. అతడు గూఢమైన మాటలతోకూడా తన ఉపదేశాన్ని అందించాడు. "నేను నోరు తెరచి ఉపమానము చెప్పెదను; పూర్వకాలపు గూఢవాక్యములను నేను తెలియ జెప్పెదను" అని అతడు ప్రకటించాడు (కీర్తన. 78:2).

ఆసాపు పలికిన పలుకుల వంటివాటినే ఆసాపుకంటె ఘనుడైనవాడు పలుకుతాడని పరిశుద్ధాత్మ వాటిని వినియోగించాడు (మత్తయి 13:35 చూడు). ఇశ్రాయేలీయుల మధ్యకు ప్రభువైన యేసు కూడా లోకారంభమునుండి మరుగైయున్న సంగతులను ఉపదేశించే వాడుగా వచ్చాడు. "ప్రవక్తయైన ఆసాపుద్వారా, పలుకబడినది నెరవేరునట్లు" – "నేను నోరు తెరచి ఉపమానము చెప్పెదను పూర్వకాలపు గూఢ వాక్యములను నేను తెలియ జెప్పెదను" అన్నట్టు ప్రభువు తన పరిచర్యను కొనసాగించాడు.

## తన తండ్రి ఇంటిని గూర్చిన ఆసక్తి (కీర్తన. 69:9)

ఏదోయొక విధమైన ఎగతాళి లేక అవమానము పవిత్రమైన ప్రత్యక్ష గుడారానికి కలిగింపబడినందుననేమో దావీదు యిలా అనడం జరిగింది, "నీ యింటినిగూర్చిన ఆసక్తి నన్ను భక్షించియున్నది" అని దావీదు అన్నాడు (కీర్తన. 69:9ఎ). అదే భావన యేసునందు ఉంటుందని నిశ్చయంగా, దావీదు ద్వారా పరిశుద్ధాత్మ ముందుగా పలికాడు.

> దేవాలయములో ఎడ్లను గొర్రెలను పావురములను అమ్మువారును రూకలు మార్చువారును కూర్చుండుట చూచి త్రాళ్లతో కొరడాలుచేసి, గొర్రెలను ఎడ్లనన్నిటిని దేవాలయములోనుండి, తోలివేసి, రూకలు మార్చువారి రూకలు చల్లివేసి, వారి బల్లలు పడద్రోసి, పావురములు అమ్మువారితో – వీటిని ఇక్కడనుండి తీసికొనిపొండి; నా తండ్రి యిల్లు వ్యాపారపుటిల్లుగా చేయకుడని చెప్పెను. ఆయన శిష్యులు – నీ యింటిని

గూర్చిన ఆసక్తి నన్ను భక్షించునని వ్రాయబడియున్నట్టు జ్ఞాపకము చేసికొనిరి (యోహాను 2:14-17).

కీర్తన. 69:9లోని రెండవ భాగము: "నిన్ను నిందించువారి నిందలు నా మీద పడి యున్నవి" అనేది పరిశుద్ధమైన ప్రత్యక్షగుడారంయొక్క పవిత్రతను నీచపరచే దుష్టుల నిందలు దాన్ని కాపాడుతున్న దావీదు మీద కూడా పడినట్టు అది సూచిస్తుంది. దావీదు యొక్క పలుకులకు పిలుపునిచ్చిన అప్పటి పరిస్థితి ఏమైయున్నా, 9వ వచనంలోని రెండవ భాగం కూడా ప్రభువైన యేసుకు సంభవించనై యున్నవాటిని గూర్చి తెలియజేసింది. తన తండ్రి యింటిని ప్రభువు రక్షించినప్పుడు, దానిని అక్రమంగా ఉపయోగించినవారి నిందలకు ఆయన తన్ను తాను గురి చేసికొన్నాడు. నిజానికి ఆయన తన మరణాన్ని త్వరపెట్టుకొన్నాడు; ఆయనకున్న ఒకే ఆలోచన తన తండ్రి యొక్క పరిశుద్ధతయే. ఆయన ఏ రూపంగాను తన్ను తాను సంతోషపెట్టుకో దలచుకోలేదు. "క్రీస్తుకూడా తన్ను తాను సంతోషపరచుకొనలేదు గాని – 'నిన్ను నిందించువారి నిందలు నా మీదపడెను' అని వ్రాయబడియున్నట్లు ఆయనకు సంభవించెను" (రోమా 15:3).

## సమస్త జనములను ఆశీర్వదించువాడు (ఆది. 12:3)

క్రీ. పూ. 1886 ప్రాంతంలో, దేవుడు అబ్రాహాముకు యిలా వాగ్దానం చేశాడు, "భూమియొక్క సమస్తవంశములు, నీయందు ఆశీర్వదింపబడును" (ఆది. 12:3). అబ్రాహామునందు హెబ్రీయులును అన్యజనులును ఆశీర్వదింపబడుదురను ప్రవచనము దాదాపు రెండు వేల సంవత్సరాలకు ముందటిది. క్రీస్తును స్వీకరించి క్రైస్తవుడయ్యే ప్రతివాడును ఆది. 12:3లో చేయబడిన ఆది వాగ్దానంలో నేడు పాలుపంచుకోవచ్చు. విశ్వాసమూలముగా దేవుడు అన్యజనులను నీతిమంతులనుగా తీర్చుతాడని ఆ లేఖన భాగము ముందుగా తెలుపబడింది. దేవుడు ముందుగా అబ్రాహామునకు సువార్త ప్రకటించుతూ, "నీయందు అన్యజనులందరు ఆశీర్వదింపబడుదురని" తెలియజేశాడు (గలతీ. 3:8). దానికి ప్రతిఫలంగా, "విశ్వాస సంబంధులందరు విశ్వాసముగల అబ్రాహాముతో కూడా ఆశీర్వదింపబడుదురు." క్రీస్తు సంబంధులందరు అబ్రాహాము యొక్క ఆత్మసంబంధులైన సంతానమనబడతారు. "అనేక జనములకు తండ్రి" అనే పేరు అతనికి సార్థకం చేయబడుతుంది. జనములలో, విశ్వాసమునకు విధేయులైన వారెవరైనా, విశ్వాసముగల అబ్రాహామునకు చేయబడిన వాగ్దానములకు వారసులై యుంటారు. ఆ విధంగా, అబ్రాహాము కుమారుడైన యేసు క్రీస్తును రెండువేల సంవత్సరాల ప్రవచనం సూచిస్తూ ఉంటుంది (మత్తయి 1:1). ఆయన అబ్రాహాముయొక్క వాగ్దానాలను ఒకనినుండి ఒక జనాంగమునకును మరియు సమస్త జనములకు విస్తరించుటకు ప్రధానమైన సంబంధంగా ఆయన నిలిచియుంటాడు. ఈ కారణాన్ని బట్టి, ఆది 12:3 మెస్సీయాను గూర్చిన ప్రధానమైన ప్రవచనమైయుంది.

## అన్యజనులకు వెలుగు (యెషయా 49:6)

దేవుని యొక్క ప్రేమ జ్ఞానమునందు, ప్రవచనమందున్న తన సేవకుడు యాకోబు గోత్రికులకు మాత్రమే సేవచేయుట చాలదు. ప్రపంచంలోని జనులందరికిని రక్షించు వెలుగుగా ఆయన తన్ను తాను విస్తరింపజేసికొంటాడు:

> నీవు యాకోబు గోత్రపువారిని ఉద్ధరించునట్లును ఇశ్రాయేలులో తప్పింపబడిన వారిని రప్పించునట్లును నా సేవకుడవై యుండుట ఎంతో స్వల్పవిషయము; భూదిగంతములవరకు నీవు నేను కలుగజేయు రక్షణకు సాధనమగుటకై అన్యజనులకు వెలుగై యుండునట్లు నిన్ను నియమించియున్నాను (యెషయా 49:6).

ఎవరికి బలము దేవుడైయున్నాడో, దేవుని యొక్క సేవకుడుగా ముందుగా నియమింపబడిన ఆ ఘనమైన వ్యక్తి ఎవరో? (యెషయా 49:5). తన స్వకీయులనే గాక, యితర దేశముల వారిని సహా ఆశీర్వదింపగలిగే తలాంతుగల ఆ మహనీయుడెవరో? మరియ గర్భమందు యేసు రూపింపబడకముందు, ఆయన వాగ్దాన శిశువుగా నిలిచియున్నాడు. ఆశ్చర్యపోయిన నజరేతు కన్యతో గబ్రియేలు యిలా అన్నాడు, “ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు” (లూకా 1:31). గర్భంలో రూపొందిన ఈ కుమారుడు దేవుని సేవకుడై, తన స్వజనులకు సహాయపడుటకు తాను చేయగలిగింది చేస్తాడు. తన్ను ఎందరంగీకరించిరో వారందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను (యోహాను 1:12). దానికి తోడు, తన అపొస్తలులకు తాను యిచ్చిన ఆదేశాన్ని అనుసరించి, సమస్త జనములకు వారు ఈ సువార్తను తీసికొని వెళ్లవలసినవారై యున్నారు. ఆయన అపొస్తలులు సువార్తను మొదటిగా యూదులకును ఆ మీదట అన్యజనులకు అందించే ఒక విధానాన్ని అనుసరించారు.

పిసిదియలోని అంతియొకయలో, ప్రభువు యొక్క సువార్తను యూదులు వ్యతిరేకించినప్పుడు, పౌలును బర్నబాయు వెంటనే ఈ సంగతులను తెలిపారు:

> దేవుని వాక్యము మొదట మీకు చెప్పుట అవశ్యకమే; అయినను మీరు దానిని త్రోసివేసి, మిమ్మును మీరే నిత్యజీవమునకు అపాత్రులుగా ఎంచుకొనుచున్నారు. గనుక ఇదిగో మేము అన్యజనులయొద్దకు వెళ్లుచున్నాము;
>
> ఏలయనగా – నీవు భూదిగంతముల వరకు రక్షణార్థముగా ఉండునట్లు నిన్ను అన్యజనులకు వెలుగుగా ఉంచియున్నాను అని ప్రభువు మాకాజ్ఞాపించెననిరి (అపొ. 13:46, 47).

## ప్రజలకు ధ్వజముగా నిలుచు (యెషయా 11:10)

సువార్త ప్రవక్త యొక్క ప్రవచనాన్ని చూడు: “ఆ దినమున ప్రజలకు ధ్వజముగా నిలుచుచుండు యెష్షయి వేరు చిగురునొద్ద జనములు విచారణచేయును. ఆయన విశ్రమ

స్థలము ప్రభావము గలదగును" (యెషయా 11:10).

క్రీ. పూ. ఎనిమిదవ శతాబ్దంనుండి దాదాపుగా నమ్మశక్యముకాని ప్రవచనాలు వచ్చాయి. యెష్షయి సంతతిలోనుండి వచ్చే ఒకని (యెషయా 11) మీద దేవుని ఆత్మ నిలుచుండి ప్రత్యేకమైన జ్ఞానమును అతనికిచ్చును. కంటి చూపును బట్టిగాని, చెవియొక్క వినికిడిని బట్టిగాని అతడు తీర్పు తీర్చడు (యెషయా 11:3, 4), కాని నీతిని బట్టి అతడు లోకమునకు తీర్పు తీర్చును. భూనివాసులలో దీనులైనవారికి యథార్థముగా విమర్శ చేయును. ఒకానొక దినమున దుష్టులు ఆయన ఉగ్రతననుభవింతురు (యెషయా 11:4). అలంకార రూపంలో, "అతని నడుమునకు నీతియు అతని తుంట్లకు సత్యమును నడికట్టుగా ఉండును" (యెషయా 11:5). అలాగే, అలంకార రూపంగా, తన అధికార దినమున, "తోడేలు గొర్రెపిల్లయొద్ద వాసము చేయును ... " అని యెషయా అన్నాడు (యెషయా 11:6). అణిచివేసేది ఏదైనను, నీచమైన దేదైనను తన పరిశుద్ధ పర్వతముమీద కన్పించదు, ఆయన ఏలుబడిని గూర్చిన జ్ఞానము విశ్వవ్యాప్తమై యుంటుంది (యెషయా 11:9). జనములకు ఆయన ధ్వజముగా ఉంటాడు, అన్యజనులు ఆయనను వెదకుతారు (యెషయా 11:10). ఆయన నివాసము మహిమతో కూడినదైయుంటుంది. భూమి యొక్క నలుదిశలనుండి ఇశ్రాయేలీయులలో శేషించినవారును, భూ దిగంతములవరకు చెదరిపోయిన వారు (అన్యజనులలో చెదరిపోయినవారు) జనములను పిలుచుటకు నిలబెట్టబడిన ధ్వజము వద్దకు వచ్చెదరు (యెషయా 11:12).

గంభీరమైన యెషయా యొక్క ప్రవచనాన్ని నెరవేర్చడానికి యెష్షయి సంతతిలోనుండి వచ్చిన ప్రభువైన యేసు మాత్రమే నెరవేర్చడానికి యోగ్యుడు (రోమా 15:12). చదువుకోని నజరేతు వడ్రంగియగు యౌవ్వనుని జ్ఞానం తన సొంత పట్టణపు జనులను ఆశ్చర్య చకితులనుగా చేసింది: "ఈ సంగతులు ఇతనికి ఎక్కడనుండి వచ్చెను?" అని వారు చెప్పుకున్నారు (మార్కు 6:2). విశ్రాంతిదినమున పక్షవాయువుగలవానిని స్వస్థపరచి యూదులను కలవరపరచాడు; ఈ సత్ క్రియ చేయడంతో ఆయన విమర్శకు గురి అయ్యాడు (యోహాను 7:23, 24). తృణీకరింపబడిన వారితోను, ప్రేమింపబడని వారితోను ఆయన దయగా ఉన్నాడు (మత్తయి 21:31; 9:10), అదియు యెషయా ప్రవచించినట్టే జరిగింది (11:4). ఆయన నీతినిగూర్చి యెషయా ముందుగా తెలిపినట్టే, (యెషయా 11:5), "ఆ నీతిమంతుని జోలికి పోవద్దని" పిలాతు భార్య తన ఆమోద ముద్రను వేసింది. (మత్తయి 27:19).

అక్షరార్థంగా, తోడేలును గొర్రెపిల్ల వద్ద వాసం చేయించడానికి ప్రభువైన యేసు ఎన్నడును ప్రయత్నించలేదు సరిగదా, తన సంఘంతో కూడా అలాటి యత్నం ఎన్నడూ జరిగించలేదు (యెషయా 11:6). ఆయన రెండవ సారి ప్రత్యక్షమయ్యే సరికి జంతువులను సాధన చేసే పనికి సమయం లేకుండానే పోతుంది. ఎందుకంటే విశ్వమంతా అగ్నిచేత దహింపబడుతుంది (2 పేతురు 3:10). తోడేలు గొర్రెపిల్ల ప్రవచనపు నెరవేర్పు అక్షరార్థంగా చెప్పినట్టు జరగాలనుకుంటే, అట్టివాడు శాశ్వతంగా నిరాశపాలౌతాడు. ఏదియెలాగున్నా, దాని భావాన్ని అలంకారికంగా (నీతి నడికట్టు అని యెషయా 11:5లో ఉన్నరీతిగా) ఆలోచించినట్లయితే, సమస్తము సరిపోతుంది.

అలంకారికంగా, తోడేలువంటి మనుష్యులు గొర్రెలవలె మార్పునొందినవారై, చిన్న పిల్లలకు సహితము హాని చేయరు (యెషయా 65:17-25 చూడు). మృగ స్వభావముగల మనుష్యులు, క్రీస్తు సువార్తయొక్క స్వార్థరహితమైన ప్రేమవలన, దయాహృదయులుగాను, స్వార్థరహితమైన ప్రేమగలవారుగాను, సహాయం చేసేవారుగాను మార్చబడ్డారు. ఉపమార్థక భావార్థాన్ని ఒకడు గ్రహించి, పాప మానవుల జీవితాల్లో దాని నెరవేర్పును సంగ్రహించి నప్పుడు, అడవి మృగాలను సాధుపరచు కార్యక్రమంలో సువార్త ఎంతటి బలహీనమైనదై యుంటుందో వేరుగా చెప్పనవసరం లేదు. తప్పక, అటు యెషయాకును, యిటు ప్రభువైన యేసుకును వారి మనస్సులో యింతకంటే ముఖ్యమయింది ఉండి తీరాలి.

"పరిశుద్ధ పర్వతము" అలంకారికంగా క్రొత్త నిబంధన సంఘమనే భావాన్ని సూచించ డంలో కొనసాగింది (హెబ్రీ. 12:22, 23). సంఘము సత్యమునకు స్తంభమై యుండగా, సముద్రము జలములతో నిండినట్టు, సువార్త సందేశము లోకమంతటికి వెళ్లింది (యెషయా 11:9; కొలస్సీ. 1:5, 6 చూడు). యూదులలోనేమి అన్యజనులలోనేమి ప్రీతిగల జనులకు ప్రభువైన యేసు, ప్రమాణాన్ని నియమించే, జనులకు ధ్వజముగా నిలిచినవాడయ్యాడు! (యెషయా 49:22; 62:10; యోహాను 3:14-16; 12:32లను చూడు.)

యెష్షయి కుమారుడైన యేసు, యెషయా పలికినట్టు ధ్వజముగా నిలిచియుండక పోయినట్లయితే, అప్పుడు, అయ్యో, దేవుని వాక్యము నిరర్థకమయ్యుండేదే. క్రీ. శ. 70లో యెష్షయి వంశావళికి సంబంధించిన చర్మపు చుట్టలు లయపరచబడ్డాయి. క్రీ. శ. 70కి ముందే యెష్షయి యొక్క సరియైన కుమారుడెవరో గుర్తింప జేసికొనడంలో తప్పిపోయి, యెషయా ప్రవచించినట్టు తాను ప్రజలకు ధ్వజముగా రుజువు చేసికొనకపోయి ఉన్నట్టయితే, అప్పుడు మానవ జాతియంతా విచారంలో మునిగి చావవలసి వచ్చేదే. ఆ తరువాత నిరీక్షణ ఏదియు మానవ నిరీక్షణను మెరుగు చేయలేకపోయి ఉండేదే. అది అలాగే జరిగియున్నట్టయితే, ఉత్సాహపూరితమైన యెషయా యొక్క ప్రవచనం మహిమా యుక్తమైన భవిష్యత్తును కోల్పోయినదై, నెరవేర్చబడడానికి అసాధ్యమైన జీవంలేని కలగానే మిగిలిపోయి ఉండేదే. క్రీ. శ. 70నుండి ఎవడును తాను యెష్షయి వంశ క్రమంనుండి వచ్చినవాడనని తన్ను తాను గుర్తించుకోలేడు.

## న్యాయమును తెచ్చువాడు (యెషయా 42:1-4)

యెషయా 42:1-4లో భూలోకమందు న్యాయము స్థాపించువరకు మందగిలని ఒక దేవుని, సేవకుని గూర్చి ముందుగా ప్రవచించింది:

> ఇదిగో నేను ఆదుకొను నా సేవకుడు, నేను ఏర్పరచుకొనిన వాడు నా ప్రాణమునకు ప్రియుడు. అతనియందు నా ఆత్మ ఉంచియున్నాను. అతడు అన్యజనులకు న్యాయము కనుపరచును. అతడు కేకలు వేయడు అరువడు తన కంఠ స్వరము వీధులలో వినబడనీయ్యడు. నలిగిన రెల్లును అతడు విరువడు మకమకలాడుచున్న జనపనార వత్తిని ఆర్పడు. అతడు సత్యముననుసరించి న్యాయము కనుపరచును. భూలోకములో న్యాయము స్థాపించువరకు అతడు మందగిలడు నలుగుడుపడడు. ద్వీపములు అతని బోధకొరకు కనిపెట్టును.

ఈ ప్రవచన భాగంలో "న్యాయము" అనే మాట మూడు సార్లు కన్పిస్తుంది. సత్యము ననుసరించి న్యాయమును తెచ్చువాడు సంచలనం కలిగించేవాడో లేక వీధులలో నిలిచి గొప్ప ప్రసంగాలు చేసేవాడు కాడు. విరిగిన రెల్లుకు, మారుమనస్సు పొందే పాపికి అతడు రెండో తరుణం యిస్తాడు; మకమకలాడుతున్న ఒత్తిడియొక్క నిరీక్షణతోకూడిన జ్వాలను అతడు సజీవంగా నిలుపుతాడు. అట్టి దీన పాపిలో దాన్ని నిలుపుతాడు. తన పనిని తుద ముట్టించేవరకు అతడు ఆగడు, సకల దేశజనులు ఆయన న్యాయ సూత్రాల కొరకు కనిపెడుతూ ఉంటారు.

అట్టి ఆశాపూరితమైన, నిరీక్షణతోకూడిన అర్థసహితమైన ప్రతిపాదనలు ఎవరిని గూర్చి పలుకబడియుంటాయి? మత్తయి ప్రకారం, ప్రాచీన ప్రవచనంలో పలుకబడిన సేవకుడు, నజరేయుడైన యేసేనట:

> ఇదిగో ఈయన నా సేవకుడు ఈయనను నేను ఏర్పరచుకొంటిని ఈయన నా ప్రాణమున కిష్టుడైన నా ప్రియుడు ఈయన మీద నా ఆత్మ నుంచెదను. ఈయన అన్యజనులకు న్యాయవిధిని ప్రచురము చేయును ఈయన జగడమాడడు, కేకలు వేయడు వీధులలో ఈయన శబ్దమెవనికిని వినబడదు విజయ మొందుటకు న్యాయవిధిని ప్రభలము చేయువరకు ఈయన నలిగిన రెల్లును విరువడు మకమక లాడుచున్న అవిసేనారను ఆర్పడు. ఈయన నామమందు అన్యజనులు నిరీక్షించెదరు అనునదే (12:18-21).

## నిర్హేతుకంగా ద్వేషింపబడ్డాడు (కీర్తన. 35:19; 69:4)

దావీదు తరచుగా తగని శత్రుత్వానికి గురయ్యాడు. కనీసం రెండు సార్లు, తనకు ఎక్కువమంది శత్రువులున్నట్టు "వారు నిర్హేతుకముగా" తన్ను ద్వేషించుచున్నట్టు అతడు చెప్పుకొన్నాడు (కీర్తన. 35:19); "నిర్నిమిత్తముగా నా మీద పగపట్టువారు నా తల వెండ్రుకలకంటె విస్తారముగా ఉన్నారు" (కీర్తన. 69:4).

మానవులలో ప్రతి ఒక్కనిని చాలా గాఢంగా ప్రేమించి, ఎవనికిని ఎన్నడును హాని కోరని ఒకనిపై ఎక్కువ నిర్హేతుకంగా అసూయపడ్డారే ఆయన నోట ఏ కపటమును కనబడలేదు (1 పేతురు 2:22) నిర్దోషి, నిష్కల్మషుడు, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడు, ఆకాశమండలముకంటె ఉన్నతమైనవాడు (హెబ్రీ. 7:26). సరియైన ఆలోచనగల జనులకు బహు ప్రియుడైన యేసు (2 కొరింథీ. 10:1), సాత్వికుడు దీనమనస్సు గలవాడు.

ఆలాటి వ్యక్తి సహా నిర్హేతుకమైన ద్వేషానికి గురి అవడం ఎంత వింత! ఏదియేలాగున్నా, అలాటి ఎదురు చూడని, వక్రంగా త్రిప్పబడే పరిస్థితి ఆయనకు విరోధంగా ప్రవచింప బడింది: "ఇప్పుడైతే వారు నన్నును నా తండ్రిని చూచి ద్వేషించుచున్నారు. అయితే నన్ను 'నిర్హేతుకముగా ద్వేషించిరి' అని వారి ధర్మశాస్త్రములో వ్రాయబడిన వాక్యము నెరవేరునట్లు ఈలాగు జరిగెను" (యోహాను 15:24, 25).

ఆయన మనోహరత్వంతోపాటు, మహిమా ప్రభావములుగల వానిగా ధరింప జేయబడినవాడై ("ఎవడును చేయని క్రియలు"; యోహాను 15:24). అద్భుతములు ఆయనకు యోగ్యతా పత్రాలుగా నిలిచియున్నాయి. ఆయన దేవత్వాన్ని గూర్చి అనుమా

నాస్పదమైన విమర్శకులను సహితము ఒప్పించడానికి అవి సరిపోయినంత రుజువులై యున్నాయి. ఏదియెలాగున్నా; కొందరు ఒప్పింపబడకయే ఉండినవారై, వారి మెస్సీయాను నిరాకరించినందులకు "వారి పాపములకు మిషలేని"వారై ఉండిపోయారు (యోహాను 15:22). ఆయన ప్రేమ ద్వేషంతో చెల్లింపబడింది.

## సాత్వికుడైన రాజు (జెకర్యా 9:9)

తమ కొరకు గుర్రములను అధికముగా సమకూర్చుకొనకూడదు అని దేవుడు ఇశ్రాయేలు రాజులకు ఆజ్ఞాపించాడు (ద్వితీయో. 17:16). సొలొమోను, తన వ్యర్థతలోను, మానవ బలముపై ఆధారపడినవాడై దేవుని యొక్క షరత్తులను ఉల్లంఘించాడు (1 రాజులు 4:26). మెస్సీయాను గూర్చియైతే, సాత్వికమైన సవారి చేయువాడైనట్టు జెకర్యా చిత్రించాడు:

> సీయోను నివాసులారా, బహుగా సంతోషించుడి; యెరూషలేము నివాసులారా, ఉల్లాసముగా ఉండుడి; నీ రాజు నీతిపరుడును, రక్షణగలవాడును దీనుడునై, గాడిదను గాడిదపిల్లను ఎక్కి నీ యొద్దకు వచ్చుచున్నాడు. ఎఫ్రాయిములో రథములుండకుండ నేను చేసెదను; యెరూషలేములో గుర్రములు లేకుండ చేసెదను, యుద్ధపు విల్లు లేకుండ పోవును, నీ రాజు సమాధాన వార్త అన్యజనులకు తెలియజేయును, సముద్రము నుండి సముద్రమువరకు యూఫ్రటీసు నది మొదలుకొని భూదిగంతములవరకు అతడు ఏలును (జెకర్యా 9:9, 10).

ప్రవక్త ఈ విషయాన్ని రచించే కాలానికి (క్రీ. పూ. 520) యూదాలో రాజులు లేక పోవడాన్ని బట్టి జెకర్యా యొక్క ప్రవచనం సుప్రసిద్ధమయ్యింది, అప్పటినుండి ప్రభువైన యేసు కాక మరెవ్వరు లేకపోయారు కూడా! ఆ ప్రవక్త మాటలను ప్రభువైన యేసు నెరవేర్చడం ఆశ్చర్యంగా ఉంటుంది:

> … యేసు తన శిష్యులలో ఇద్దరిని చూచి మీ యెదుటనున్న గ్రామమునకు వెళ్లుడి; వెళ్లగానే కట్టబడియున్న యొక గాడిదయు దానితోనున్న యొక గాడిద పిల్లయు మీకు కనబడును. వాటిని విప్పి నాయొద్దకు తోలుకొని రండి; ఎవడైనను మీతో ఏమైనను అనిన యెడల – అవి ప్రభువునకు కావలసియున్నవని చెప్పవలెను, వెంటనే అతడు వాటిని తోలి పెట్టునని వారిని పంపెను. ప్రవక్తవలన చెప్పబడినది నెరవేరునట్లు ఇది జరిగెను, అదే మనగా:
>
> ఇదిగో నీ రాజు స్వాతికుడై, గాడిదను బారవాహక పశువుపిల్లయైన చిన్న గాడిదను ఎక్కి నీ యొద్దకు వచ్చుచున్నాడని సీయోను కుమారితో చెప్పుడి అనునది.
>
> శిష్యులు వెళ్లి యేసు తనకాజ్ఞాపించిన ప్రకారము చేసి ఆ గాడిదను దాని పిల్లను తోలుకొని వచ్చి వాటిమీద తమ బట్టలువేయగా ఆయన బట్టలమీద కూర్చుండెను. జనసమూహములోను అనేకులు తమ బట్టలు దారిపొడుగున పరచిరి; కొందరు చెట్లకొమ్మలు నరికి దారిపొడుగున పరచిరి (మత్తయి 21:1-8).

## యూదాలో రాజునకు గల హోదా (ఆది. 49:10)

క్రీ. పూ. 1644 ప్రాంతంలో, పితరుడైన యాకోబు తన మరణశయ్య మీద గోషేను దేశమందు ఉన్నవాడై తన కుమారులకు దీవెనలను ప్రకటించాడు. యూదాను గూర్చి యాకోబుద్వారా పరిశుద్ధాత్మ యిలా తెలియజేశాడు,

> షిలోహు వచ్చువరకు యూదా యొద్దనుండి దండము తొలగదు అతని కాళ్ల మధ్యనుండి రాజదండము తొలగదు ప్రజలు అతనికి విధేయులై యుందురు (ఆది. 49:10).

ఈ ప్రవచనం ధైర్యంగాను అసాధారణంగాను వినిపిస్తుంది. యూదా జ్యేష్ఠకుమారుడు కాదు (ఆది 49:3) సరిగదా, అతడు తన జన్మ హక్కును పొందినవాడు కూడా కాదు (1 దినవృ. 5:1). ఏదియెలాగున్నా, అశుభారంభం తరువాత, యూదా, హూందాతనాన్ని, స్వార్థరహితమైన ప్రేమను కనుపరచి, "తన సహోదరుల కంటె హెచ్చినవాడాయెను" (1 దినవృ. 5:2). భవిష్యత్తువైపు చూస్తూ, ఇశ్రాయేలీయుల నాయకుడు వారి ఏలిక యూదాలోనుండి రావాలని దేవుడు తీర్మానించాడు. కడపటిగా, గొప్ప ఏలిక, మెస్సీయా యూదాలోనుండి వచ్చాడు (హెబ్రీ. 7:14).

యూదా యొక్క సంతతిలోని వాడెవడైనా రాజ దండాన్ని చేత పుచ్చుకొనడానికి ముందు దాదాపు ఆరువందల సంవత్సరాలైనా గడిచిపోవాలి. అప్పుడు యూదా సంతతి వాడైన దావీదు మొదట దక్షణపు భాగం మీద రాజుగా అభిషేకింపబడతాడు, అటు తరువాత (క్రీ.పూ. 1010 ప్రాంతంలో) ఉత్తరపు రాజ్యం మీదకూడా రాజౌతాడు.

యూదానుండి చైతన్యవంతమైన రాజరికాన్ని పాపాన్ని బట్టి దేవుడు తొలిగించాడు. 590లో, సిద్కియాను గూర్చి ఆయన యిలా చెప్పేవరకు దేవుడు సమస్తాన్ని సహించాడు,

> గాయపడినవాడా, దుష్టుడా, ఇశ్రాయేలీయులకు అధిపతీ, దోష సమాప్తి కాలమున నీకు తీర్పు వచ్చియున్నది. ప్రభువైన యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు – తలాటమును తీసివేయుము కిరీటమును ఎత్తుము, ఇది యికను ఇట్లుండదు. ఇక మీదట నీచుని ఘనునిగాను ఘనుని నీచునిగాను చేయుము. నేను దాని పడద్రోయుదును పడద్రోయుదును పడద్రోయుదును, దాని స్వాస్థ్య కర్త వచ్చువరకు అదియు నిలువదు, అప్పుడు నేను దానిని అతనికిచ్చెదను (యెహెజ్కేలు 21:25-27).

యెహెజ్కేలు ద్వారా ప్రవచింపబడినది నాలుగు సంవత్సరాలలో నెరవేర్చబడింది. చివరి రాజైన సిద్కియాను దించి, అన్యుడైన నెబుకద్నెజరు చేతికి ఆయన దానిని అప్పగించాడు (2 రాజులు 25:1-7).

పాపం ఎంతగా ప్రబలియుందంటే యూదా యొక్క సంతతిలో భౌతిక రాజరికాన్ని పూర్తిగా లేకుండ చేసేంతవరకు దేవుడు శాసించాడు. ప్రత్యేకించి సిద్కియా యొక్క అన్న కుమారుడైన ఎకొన్యాను గూర్చి, దేవుడు యిలా సెలవిచ్చాడు:

> సంతాన హీనుడనియు, తన దినములలో వర్ధిల్లనివాడనియు ఈ మనుష్యుని గూర్చి వ్రాయుడి; అతని సంతానములో ఎవడును వర్ధిల్లడు, వారిలో ఎవడును దావీదు సింహాసనమందు కూర్చుండడు; ఇకమీదట ఎవడును యూదాలో రాజుగా నుండడు (యిర్మీయా 22:30).

ఎకొన్యా యూదాలో వారసుడు లేని రాజుగా అంటే బిడ్డలు లేని రాజుగా నిలిచి పోయాడు. అయినా వెయ్యేండ్లకు ముందుగా దేవుడు యూదాకు చేసిన వాగ్దానాన్ని బట్టి, షిలోహు, విశ్రాంతి యొక్క నరుడు భద్రతనొసంగువాడు వచ్చువరకు రాజదండము యూదాలోనుండి తొలిగిపోదు. అయినా, ఎకొన్యా భౌతికమైన సంతతి లేనివాడని దాని భావం కాదు (మత్తయి 1:12), కాని అతని సంతతివారిలో అక్షరార్థంగా భౌతికంగా రాజులెవరూ లేరు. రాజదండము నిలుపబడింది కాని, సిద్కియా మొదలు ప్రభువైన యేసువరకు, అంటే షిలోహువరకు, శాంతిని కలిగించువాడు, భద్రత నొసంగువాడు వచ్చేవరకు అది ఉపయోగింపబడలేదు!

అయన యొక్క తొలి రాకలో భౌతికమైన యూదాలో ఆయన రాజైయున్నా, లేక ఆయన రెండవ రాకడలో యెరూషలేములో ఆయన భౌతికమైన రాజైయుండినా, అప్పుడు, యిర్మీయా ద్వారా దేవుడిచ్చిన పాత నిబంధన ప్రవచనము పతనమయ్యేదే. పెంతెకొస్తు దినాన (క్రీ. శ. 30, మే 28న), పరలోకమందు దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడై ఆత్మ సంబంధమైన రాజుగా ప్రభువైన యేసు ఏలనారంభించినప్పుడు, అది యాకోబు యొక్క పదహారువందల కాలం నాటి ప్రవచనం నెరవేర్చబడింది:

> షిలోహు వచ్చువరకు యూదా యొద్దనుండి దండము తొలగదు. అతని కాళ్ల మధ్యనుండి రాజదండము తొలగదు ప్రజలు అతనికి విధేయులైయుందురు (ఆది. 49:10).

## చిగురు (యిర్మీయా 23:5)

వృక్ష శాస్త్రంలో వినియోగించే ఒక పదాన్ని తన కుమారుని వర్ణించడానికి దేవుడు ఏరుకున్నాడు: *Tsemah,*[2] "చిగురు ." యెష్షయి మరియు దావీదు యొక్క వంశావళిలో ప్రభువైన యేసు చిగురైయున్నాడు (యెషయా 11:1). భౌతికమైన ఆయన రూపాన్నిబట్టి, లేత మొక్కవలెను ఎండిన భూమిలో మొలచిన మొక్కవలెను ఆయన ఉన్నాడు (యెషయా 53:2). ఆత్మసంబంధముగానైతే, చిగురు అని పిలువబడిన వాడు చాలా ఆకర్షణీయుడుగా వర్ణించబడ్డాడు (జెకర్యా 6:12). నరులకంటె అతి సుందరుడుగా ఉన్నాడు (కీర్తన. 45:2), ఆయన సౌందర్యము పరిశుద్ధమైన సొగసైయుంది. తండ్రివలన కలిగిన అద్వితీయకుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి, అది కృపాసత్య సంపూర్ణతతో ఉంది (యోహాను 1:14). ఆయన దేవుడైన యెహోవా కొరకు ఆలయాన్ని కట్టతాడు (జెకర్యా 6:13), అది సంఘం, మరియు ఆయన రాజై పాలన చేస్తాడు. ఈ రాజు వివేకముగా నడుచుకొనుచు కార్యము జరిగించును, భూమిమీద నీతి న్యాయములను జరిగించును (యిర్మీయా 23:5).

*Tsemah,* చిగురు, ఆత్మసంబంధమైన తన సింహాసం మీద కూర్చుండి రాజ్యపాలన చేయడం మాత్రమేగాక, ఆయన సింహాసం మీద ఉండగా యాజకుడుగా పని చేస్తాడు. వంశావళిని బట్టి భూమిమీదనున్నట్టయితే ఆయన యాజకుడైయుండతగడు. ఎందుకంటే, తన పితరుడైన దావీదుద్వారా యూదా గోత్రపు (కొమ్మ) చిగురైయున్నందున, "ఆ గోత్ర విషయములో యాజకులను గూర్చి మోషే యేమియు చెప్పలేదు" (హెబ్రీ. 7:14). గనుక

భౌతికంగాను అక్షరార్థంగాను, ఆయన ఎన్నడును యాజకుడైయుండేవాడు కాడు. ఆయన భూమిమీదికి తిరిగి వచ్చినయెడల, "యాజకుడై యుండడు" (హెబ్రీ. 8:4).

ఆయన యాజకత్వము ఆత్మసంబంధమైనది, పరలోక సంబంధమైనదియునైనట్టే ఆయన ఏలుబడియు ఆత్మసంబంధమైనది, పరలోక సంబంధమైనదే. పరలోకమందు ప్రవేశించి మహామహుని సింహాసనమునకు కుడిపార్శ్వమున ఆసీనుడైన ప్రధానయాజకుడు మనకున్నాడు (హెబ్రీ. 8:1). ప్రధానయాజకుడును, రాజునైయున్న ఆ చిగురు, యికమీదట శరీరముతో లేడు సరిగదా, యిక మరెన్నడును ఆయన శరీరధారి కాడు (2 కొరింథీ. 5:16). తనవారికొరకు ఆయన తిరిగి వచ్చినప్పుడు, ఆయన తిరిగి శరీరికాడు, ఆయన పాదాన్ని భూమిమీద మోపడు. దానికి బదులు (నిద్రించిన తనవారు) లేచునట్లును, (మేల్కొనియున్న వారు నిద్రనుండి లేచినవారితో పాటు) మహిమగల తన శరీరమునకు సమరూపములుగా మార్చి ఆకాశమండలము మీదికి కనురెప్పపాటున కొనిపోబడేలా వారికి పిలుపునిస్తాడు. (1 కొరింథీ. 15:51, 52; ఫిలిప్పీ. 3:20, 21; 1 థెస్స. 4:16–18). మహిమాయుక్తమైన సంగతులు *Tsemah,* చిగురును గూర్చి పలుకబడ్డాయి.

## దేవునిగా కిరీటము ధరింపజేయబడ్డాడు

## (కీర్తన. 45:6, 7)

"మనిషిని" గూర్చి ఉపయోగింపబడిన కొన్ని హెబ్రీ పదాలు తన భూసంబంధమైన (Heb.: *'adam*), సున్నితమైన (Heb.: *'enosh*) స్వభావాన్ని సూచిస్తాయి. తక్కినవి "మనిషి" ని గూర్చి భర్తగా (Heb.: *'ish*), బలముగల జీవి (Heb.: *gibbor*), లేక దేవుని స్వరూపములో (Heb.: *'elohim*) పోలుగలవాడు అనడానికి సూచించబడ్డాయి. పరలోక సంబంధమైన మానవ స్వభావాన్ని గూర్చి, "–మీరు దైవములనియు [Heb.: *'elohim*, మీరందరు సర్వోన్నతుని కుమారులనియు నేనే సెలవిచ్చియున్నాను" (కీర్తన. 82:6). "దేవుడు" (Heb.: *'elohim*) అని తర్జుమా చేయబడిన అదే పదం యిట్టి సందర్భంలో మానవ జీవులను వర్ణించడానికి కూడా వినియోగింపబడింది. "దైవములు" అని చేయబడిన తెలుగు తర్జుమా అనేకమంది దైవములున్నట్టి తప్పుడు భావనకు వచ్చే అవకాశముంది. ఏదియెలాగున్నా, ఒకే నిజమైన దేవుడున్నట్టు బైబిలు స్పష్టంగా బోధిస్తుంది. (ద్వితీయో. 6:4; యెషయా 44:6; 1 కొరింథీ. 8:2, 3). అది సత్యమైయుండగా, కీర్తన రచయిత నరులను వర్ణించడానికి అదే పదాన్ని ఉపయోగించాడంటే, పరలోక సంబంధమైన మానవ ఆత్మయొక్క స్వభావాన్ని వర్ణించడానికిని ఉద్దేశించినట్టు తీసికోవాలి. ఏ జంతువును *'elohim* ("దేవుడు") అని సూచింపబడలేదు, గాని మనిషి సూచింపబడ్డాడు.

("దేవుడు" మరియు "దేవుని స్వరూపమందలి నరుడు") అనే రెండు అర్థాలతో *'elohim* అనే పదం స్పష్టంగా ఉపయోగింపబడిందనే వాస్తవం, కీర్తన. 45:6, 7లను గ్రహించడానికి మనకు సహాయపడుతుంది:

> దేవా, నీ సింహాసనము నిరంతరము నిలుచును నీ రాజదండము న్యాయార్థమైన దండము. నీవు నీతిని ప్రేమించి భక్తిహీనతను ద్వేషించుచున్నావు. కావున దేవుడు నీ దేవుడై చెలికాండ్రకంటె హెచ్చగునట్లుగా నిన్ను ఆనందతైలముతో అభిషేకించియున్నాడు.

సొలొమోను యొక్క వివాహాలలో ఒక దానిని సూచిస్తూ, ఒరిజినల్‌గా కీర్తన. 45 శ్రేష్ఠంగా వివరించబడింది. 6, 7 వచనాలు నూతనమైన భర్తను ప్రశంసించే కానుకగా: అతడు నీతిగల రాజు, మరియు అతడు దేవుడు (అంటే, దైవ స్వరూపుడు అని భావం).

ఏదియెలాగున్నా, కీర్తన. 45:6, 7 అనేవాటికి "సొలొమోను కంటె గొప్పవాని" యందు (మత్తయి 12:42) హెచ్చయిన నెరవేర్పుంది. "శిష్యుడు బోధకునికంటె అధికుడు కాడు; దాసుడు యజమానునికంటె అధికుడు కాడు" (మత్తయి 10:24) అనేది వాస్తవమైయుండగా, సొలొమోను యొక్క కుమారుడు తన పితరునికంటె అధికుడనేది కూడా వాస్తవమే. క్రీ.శ. 30 – పెంతెకొస్తు దినమున, పరలోకమందు దేవుని కుడిపార్శ్వమున – యేసు క్రీస్తు పరలోకమునకును, భూలోకమునకును రాజుగా నియమింపబడ్డాడు (ఎఫెసీ. 1:22, 23; మత్తయి 28:18). తన పట్టాభిషేక దినమున, తండ్రియైన దేవుడు, సొలొమోనుకు వర్తింపచేయబడిన ఆ భాషను హెచ్చించి, తనదిగా వాడుకున్నాడు:

> తన కుమారుని గూర్చియైతే (దేవుడు) యిలా చెప్పుతున్నాడు,
>
> దేవా, నీ సింహాసనము నిరంతరము నిలుచునది; నీ రాజదండము న్యాయార్థ మయినది. నీవు నీతిని ప్రేమించితివి దుర్నీతిని ద్వేషించితివి అందుచేత దేవుడు నీ దేవుడు నీతోడివారికంటె నిన్ను హెచ్చించునట్లుగా ఆనందతైలముతో అభిషేకించెను (హెబ్రీ. 1:8, 9).

సొలొమోను యొక్క పరిపాలనను, క్రీస్తు ప్రభువు పరిపాలనను వర్ణించడానికి "నీతి," అనే ఒకే పదాన్ని దేవుడు ఉపయోగించాడు; అయితే అది ప్రభువునకు వర్తింపజేయ బడినప్పుడు మాత్రం మరింత ఎక్కువైన, బహుగా హెచ్చింపబడిన భావంతో అది ఉపయోగింపబడింది. అలాగుననే, సొలొమోను అనే వ్యక్తిని వర్ణించడానికి ఉపయోగింప బడిన "దేవుడు" (దేవుని స్వరూపంలో ఉన్న సొలొమోను) అనే పదం, ప్రభువైన యేసు యొక్క స్వభావాన్ని (అంటే, దేవత్వాన్ని) వర్ణించడానికి వినియోగించబడింది, కాని సొలొమోనుకు వర్తింపజేసిన దానికంటె బహు ఎక్కువైన భావంతో అది ప్రభువునకు వర్తించింది.

---

సూచనలు

[1]మెస్సీయా యొక్క జననము, జీవితాన్ని గూర్చిన అధికమైన పాత నిబంధన ప్రవచనాలు గత సంచికలో పరీక్షింపబడ్డాయి. "బైబిలుయొక్క దైవ ప్రేరేపణ మరియు అధికారం"లో చూడు. "దావీదు కుమారుడు" (2 సమూ. 7:12), "బేత్లెహేమీయుడు" (మీకా 5:2), "ఐగుప్తునుండి పిలువబడినవాడు" (హోషేయ 11:1)

అనే ఈ ప్రవచనాలు క్రీస్తునందు నెరవేర్చబడ్డాయి. [2]“చిగురు” అనేదానికి (యెషయా 11:1) *hoter* మరియు *netser* (యెషయా 53:2) *yonek* అనే యితర వృక్ష శాస్త్ర పదాలు ఉపయోగించబడ్డాయి.